సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



విద్యుత్‌కు వేసవి షాక్

వేసవిలో విద్యుత్ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. లేదంటే మొదటికే ముప్పు వస్తుంది.

- 8లో



ఆరోగ్యం భద్రం

వేసవి తాపం పెరుగుతోంది. అప్రమత్తంగా లేకుంటే ఆరోగ్యానికి హాని తప్పదు.

- 8లో

సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ అమూల్య



శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సి.అమూల్యను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. అమూల్యను రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా నియమించారు. ప్రస్తుతం ఆమె ఆంధ్రా మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. త్వరలోనే బాధ్యతలు తీసుకుంటానని ఆమె తెలిపారు.

న్యూస్‌రీల్

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పాలిసెట్–2025 ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల ఇన్‌చార్జి బి.జానకిరామయ్య ఆదివారం చెప్పారు. శ్రీకాకుళం, టెక్కలి రెండు డివిజన్లలో పరీక్ష నిర్వహణ ఈ నెల 30న ఉంటుందని అన్నారు. శ్రీకాకుళం డివిజన్‌లో 25 పరీక్ష కేంద్రాల్లో 6952 మంది, టెక్కలి డివిజన్‌లో 14 పరీక్ష కేంద్రాల్లో 4500 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని చెప్పారు. జిల్లాలో మొత్తం 39 పరీక్ష కేంద్రాల్లో 11,452 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని వెల్లడించారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

రేపు జిల్లా స్థాయి అండర్–23 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాస్థాయి అండర్–23 బాలబాలికల బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు ఈనెల 29వ తేదీన జరుగుతాయని బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఈ ఎంపికలు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొన్న బాల, బాలికలు 23 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. బాస్కెట్‌బాల్ కోచ్ జి.అర్జున్ రెడ్డి మాట్లాడుతూ ఎంపికలలో పాల్గొన్న క్రీడాకారులు విధిగా తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9949291288 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

జోషితకు డీఈఓ అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య, ఉపాధ్యాయులు

మందస: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 597 మార్కులు సాధించిన హరిపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కంచరాన జోషితను డీఈఓ ఎస్.తిరుమల చైతన్య ఆదివారం ఆమె ఇంటికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించి జిల్లా ఖ్యాతిని పెంచిందని అన్నారు. తల్లిదండ్రులు లేపాక్షి, మాధవరావులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ బిడ్డను ప్రభుత్వ పాఠశాలలో చదివించడం ఆదర్శప్రాయమన్నారు. ఈ సందర్భంగా జోషితకు రూ.10వేలు నగదు బహుమతి అందజేశారు. విజయానికి కారణమైన హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నమోదైన అర్జీల గురించి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

భావనపాడు తీరం సందర్శన



సముద్రంలోకి తాబేలు పిల్లలను విడిచి పెడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

సంతబొమ్మాళి: భావనపాడు తీర ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. ట్రీ ఫౌండేషన్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం 420 తాబేలు పిల్లలను సముద్రంలో విడిచిపెట్టారు. కార్యక్రమంలో భావనపాడు సర్పంచ్ బుడ్డ మోహన్‌రెడ్డి, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సోమేశ్వరరావు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి నరేంద్ర, బీట్ అధికారి జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నా చేతితో ఏమీ పట్టలేను



నాకు కిడ్నీసమస్య వచ్చి మూడేళ్లు కావస్తోంది. నేను రోజు తప్పించి రోజు డయాలసిస్ చేయించుకుంటాను. నా చేతులకు ఫిస్టులా వేశారు. డయాలసిస్ చేయించుకునే సమయంలో నా చేతుల్లో ఉన్న పైపులకు డయాలసిస్ మిషన్ నుంచి అనుసంధానం చేస్తారు. ఇలా తరచూ చేయడంతో నా చేయి వదులుగా వేలాడుతూ కనిపిస్తుంది. నేను పూర్తిగా నడవ లేకపోతున్నాను. నా శరీరంలో సత్తువ రోజు రోజుకూ తగ్గుతోంది. మాకు మంచి వైద్య సేవలు అందిస్తే మేమంతా సంతోషిస్తాం.

– చిన్నమ్మలు, కిడ్నీవ్యాధి బాధితురాలు, పలాస



చేయి దాచుకుని తిరుగుతాను



వజ్రపుకొత్తూరు మండలం రామకృష్ణాపురం గ్రామం మాది. నాలుగేళ్లుగా కిడ్నీ సమస్యతో పోరాడుతూ జీవిస్తున్నాను. పలాస నెఫ్రోప్లస్ డయాలసిస్ యూనిట్‌లో సేవలు పొందుతున్నాను. నా చేయి పూర్తిగా మారిపోయింది. నేను నా షర్టు మాటున దాచుకుంటున్నాను. మాలాంటి వారి వైద్యం గురించి ఒక్కసారి ఆలోచించాలని కోరుతున్నాం.

– బొడ్డి వీరాస్వామి, రామకృష్ణాపురం, వజ్రపుకొత్తూరు మండలం



నా చేతిని చూస్తే భయపడతారు..



నా చేతిని చూసే ఎవరైనా భయపడతారు. డయాలసిస్ సేవలు అందుతున్నప్పటి నుంచి నా ఎడమ చేతిలో వాపులు భయంకరంగా మారాయి. నాకు కిడ్నీ సమస్య వచ్చిన అనంతరం ప్రాణాలు నిలుపుకోవడానికి రూ.1.50 లక్షల విలువైన గొర్రెపిల్లలను అమ్మి నేను చికిత్స చేయించుకున్నాను. ప్రైవేటులో ఫిస్టులా ఆపరేషన్ చేసుకుని ఇప్పుడు పలాస నెఫ్రోప్లస్‌లో ఉచిత డయాలసిస్ సేవలు పొందుతున్నాను. ఇప్పుడు నా చేయి రూపురేఖలు మారిపోయాయి. మా లాంటి వారి సమస్య పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

– సవర లక్ష్మమ్మ, సవరలింగుపురం, మెళియాపుట్టి మండలం

ఇంకా ఎంత బాధ అనుభవించాలి..?
ఇంకా ఎంత వేదన పడాలి..?
మాయదారి వ్యాధి గురించి బతుకంతా రోదించి..

దయాలసిస్ చేయించుకోవడానికి జీవితం మొత్తాన్ని అర్పించాక కూడా కిడ్నీ వ్యాధి బాధితుల కష్టాలు తీరడం లేదు. నైపుణ్యం లేని సిబ్బంది చేసిన నిర్వాకం వల్ల దయాలసిస్ పేషెంట్ల చేతులు రూపుమారిపోతున్నాయి. ఫిస్టులా పెట్టాక సరైన జాగ్రత్త చర్యలు వివరించకపోవడం, నిర్ధారిత మందులు అందజేయకపోవడంతో కిడ్నీ బాధితుల కష్టాలు తీవ్రమవుతున్నాయి. వ్యాధి కంటే ఈ నిర్లక్ష్యం ఎక్కువగా ముంచుతోంది.



నిర్లక్ష్యపు చేతలు
రూపు మారుతున్న చేతులు

- దయాలసిస్ చేసుకుంటున్న వారికి కొత్త సమస్య
- ఫిస్టులా ప్రాంతంలో ఉబ్బిపోతున్న వైనం
- ఆకారం కోల్పోతున్న చేతులు
- నిపుణులు కాని వారితో నెఫ్రోప్లస్ సేవలు
- ఆందోళనలో రోగులు

కాశీబుగ్గ:

ఉద్దానం కిడ్నీ వ్యాధి బాధితులకు కొత్త కష్టాలు వచ్చి పడుతున్నాయి. డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ రోగులకు ఫిస్టులా వద్ద చేతులు పొంగిపోవడం, వంగిపోవడం, ఆకారం మారిపోవడం వంటి కొత్త రకమైన సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో బాధితులు మరింత కుంగిపోతున్నారు. కనీసం చేయిని ఇతరులకు చూపించుకోలేక పోతున్నారు.

పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ యూనిట్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్య ధోరణితోనే ఈ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రైవేటు నెఫ్రోప్లస్ వారు అందిస్తున్న దయాలసిస్ సేవల్లో నైపుణ్యం, నాణ్యత కొరవడడంతో బాధితుల చేతులు రూపం కోల్పోతున్నాయి. దయాలసిస్ సేవలకు వచ్చిన రోగుల కోసం తెలిసీతెలియని సిబ్బందిని నియమించడంతో వారు ఇష్టానుసారంగా గుచ్చడం, తీయడం వంటి ప్రయోగాలు చేస్తున్నారు. అనుభవజ్ఞులు చేయాల్సిన పనిని పదో తరగతి చదువుకున్న వారితో కానిచ్చేస్తున్నారు. ఇలా వారానికి ఒకటి నుంచి మూడు సార్లు చేయడంతో రోగుల చేతులు రూపు కోల్పోతున్నాయి.

దయాలసిస్ రోగుల చేతులకు వేసిన ఫిస్టులా చుట్టూ పొంగులు, వాపులు, చెయ్యి లావడం, సన్నగా కావడం, ఒంపులు తిరగడం వంటివి జరుగుతున్నాయి. దయాలసిస్ చేసుకుంటున్న రోగులకు కనీసం పరీక్షలు చేయడం, వారికి వాపు రాకుండా చర్యలు చేపట్టడం వంటివేవీ లేకపోవడంతో ఈ దారుణ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పలాసలో మూడు షిఫ్టుల్లో 60 మంది కిడ్నీ రోగులు దయాలసిస్ సేవలు పొందాల్సి ఉంది. వారందరిలో సగం మందికి ఫిస్టులా చుట్టూరా సమస్యగానే మారింది. ఇక్కడే కాకుండా జిల్లాలో ఉన్న టెక్కలి, శ్రీకాకుళం, కవిటి, హరిపురం వంటి ప్రాంతాల్లో అనేక మంది కిడ్నీ రోగులది ఇదే పరిస్థితి.

నా దృష్టికి రాలేదు



దయాలసిస్ సేవలు పొందుతున్నవారికి ఫిస్టులా చేసుకున్న ప్రాంతంలో ఇలాంటి కొత్త సమస్యలు వచ్చినట్లు నా దృష్టికి ఎవ్వరూ తీసుకురాలేదు. ఇప్పుడే ఈ సమస్యను చూస్తున్నాను. దయాలసిస్ అయిన తర్వాత ఒక చేతితో బాల్‌ను నొక్కుతూ ఉండాలి. అలాగే వారు చేయకూడని పనులు కూడా కొన్ని ఉన్నాయి. వాటిపై అవగాహన కల్పించేందుకు నెఫ్రాలజీ వైద్యులతో అవగాహన కార్యక్రమాలు చేపడతాం. ప్రస్తుతం కిడ్నీ రోగులుకు వచ్చిన ఇలాంటి వాపుల సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్తాం.

– డాక్టర్ అల్లు పద్మజ, సూపరింటెండెంట్, కిడ్నీ పరిశోధన కేంద్రం, పలాస

చందనోత్సవానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

సింహాచలం అప్పన్న స్వామి నిజరూప దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఈనెల 30వ తేదీన ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆర్టీసీ అధికారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక బస్సులకు సాధారణ చార్జీలను మాత్రమే వసూలు చేస్తామని తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా శ్రీకాకుళం కాంప్లెక్స్ నుంచి రణస్థలం, నాతవలస, విజయనగరం, పద్మనాభం, కొంత్యాం మీదుగా అడవివరం–రణస్థలం, తగరపువలస, ఆనందపురం, కొంత్యాం మీదుగా అడవివరం వరకు ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. అడివివరం గోశాల నుంచి కొండపైకి 13 సిటీ బస్సులు నడుపుతున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపో మేనేజర్లు హనుమంతు అమర సింహుడు, కేఆర్ఎస్ శర్మ, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎం ఎంపీ రావు, ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం అర్బన్

కడతేరిన కథ

బావిలో దూకి తల్లీకూతుళ్ల ఆత్మహత్య

- శ్రీకాకుళం మండలం గూడెంలో ఘటన
- 'ఆత్మార్పణం' వెనుక అనేక కథలు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



మృతదేహాలను తాళ్లతో బయటకు లాగుతున్న దృశ్యం

నిలువెల్లా దహిస్తున్న గర్భశోకం ఓ వైపు.. నిలువెత్తున ఆవరించిన మూఢ నమ్మకం మరో వైపు.. కన్నపేగు దూరమైందన్న వేదన ఓ వైపు.. మాయలు మంత్రాలు దాటి ఆలోచించలేని మూర్ఖత్వం ఇంకోవైపు.. కలగలిపి ఆ తల్లీకూతుళ్ల కథను కడతేర్చాయి. అర్ధరాత్రి పూట ఎవరూ లేని చోట ఓ వ్యవసాయ బావిలో వారిద్దరి బతుకు ప్రయాణం ముగిసిపోయింది. ఎక్కడో దెంకాడ నుంచి కేవలం చనిపోవడానికే గూడెం వరకు రావడం, చున్నీతో కట్టుకుని మరీ బావిలో దూకేయడం, పదిహేను రోజులుగా చీడపీడలు అంటూ తిరగడం వంటి సంఘటనలన్నీ వారి ఆత్మహత్యను 'ఆత్మార్పణం'గా మార్చేశాయి.

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని గూడెం గ్రామంలోని వ్యవసాయ బావిలో శనివారం రాత్రి ఘోర విషాదం జరిగింది. విజయనగరం జిల్లా దెంకాడలో నివాసముంటున్న తల్లీకూతుళ్లు మోదు సావిత్రమ్మ (55) ఈదల వరలక్ష్మి (30) ఇక్కడి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. చాలా ఏళ్ల కిందట ఇదే గ్రామంలో నివాసం ఉన్న వీరిద్దరూ మళ్లీ చనిపోవడానికి ఇక్కడకు రావడం, నాలుగు రోజుల కిందటే వరలక్ష్మి కుమార్తె మృతి చెందడం, ఆ కేసుపై వీరు స్టేషన్‌కు వెళ్లడం వంటి ఘటనలన్నీ వారి మృతిపై అనేక కథనాలను పుట్టించాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

మోదు సావిత్రమ్మ, వరలక్ష్మి దాదాపు మూడు దశాబ్దాల ఏళ్ల కిందట బిశాయి నుంచి గూడెం గ్రామానికి వచ్చారు. ఇక్కడ కొన్నేళ్లు ఉన్నాక.. విజయనగరం జిల్లా దెంకాడకు వెళ్లిపోయారు. అక్కడే వరలక్ష్మిని ఈదల శ్రీను అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి పూర్ణచంద్రిక అనే కుమార్తె ఉంది. అక్కడే ఓ వైన్ షాపు వద్ద తల్లీకూతుళ్లు చీకుల దుకాణం నిర్వహించేవారు. శ్రీను కూలి పనులు చేసుకునేవారు. కొన్నేళ్లుగా శ్రీను, వరలక్ష్మిల మధ్య మనస్పర్థలు రావడంతో విడిగా ఉంటున్నారు.

పూర్ణచంద్రిక అమ్మ, అమ్మమ్మతో కలిసి ఉండేది. కొన్ని రోజుల కిందట బాలిక అనారోగ్యంతో మంచాన పట్టింది. అయితే ఆమెకు ఏవో చీడపీడలు సోకాయని అమ్మ, అమ్మమ్మలు కలిసి దెంకాడ నుంచి కొత్తవలస చర్చికి తీసుకెళ్లారు. అక్కడ పూజలు చేసినా నయం కాలేదు. మరుసటి రోజు వైజాగ్ జ్ఞానాపురంలోని చర్చికి తీసుకెళ్లారు. అక్కడ పాస్టర్ ప్రార్థనలు చేసి పంపించేశారు. అయితే వీరు వెళ్లకుండా ఆ రోజు చర్చి పరిసర ప్రాంతాల్లోనే ఉండిపోయారు. అయితే బాలికను తల్లి, అమ్మమ్మ కలిసి కొట్టడం, నోట్లో గుడ్డలు పెట్టి ఇష్టానుసారం చేయడంతో ఆమె సొమ్మసిల్లిపోయిందని అక్కడి వారు చెబుతున్నారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం చర్చి



మృతదేహాలు

ఆత్మార్పణమేనా..?

బాలిక 24వ తేదీ చనిపోయాక తల్లీకూతుళ్లు కలిసి ఒకనాడు తాము నివాసం ఉన్న గూడెం గ్రామానికి శనివారం రాత్రి చేరుకున్నారు. చున్నీతో ఇద్దరూ కట్టుకుని, ఓ బ్యాగును భుజాన తగిలించుకుని నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న వ్యవసాయ బావిలో దూకేశారు. తాము ఆత్మార్పణ చేసుకుంటే బాలికకు పునర్జన్మ లభిస్తుందనే భ్రమతోనే వీరు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని అక్కడి వారంతా చెబుతున్నారు. ఆదివారం ఉదయం బావిలో మృతదేహాలు తేలియాడడం చూసిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందజేశారు. వారు అగ్నిమాపక సిబ్బందికి చెప్పడంతో వారి సాయంతో మృతదేహాలను బయటకు తీసి రిమ్స్‌కు తరలించారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వరలక్ష్మి (ఫైల్)

తీసే సరికి బాలికను అమాంతం చర్చి లోపలకు తీసుకెళ్లి పడుకోబెట్టారు. బాలిక ఎంతకూ లేవలేకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. వారు వచ్చి పరిశీలించి బాలిక చనిపోయిందని నిర్ధారించుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలిక తండ్రికి కూడా సమాచారం అందించడంతో ఆయన వెంటనే చర్చికి చేరుకున్నారు. బాలిక మృతికి తల్లి, అమ్మమ్మలే కారణమని ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో తల్లీకూతుళ్లు స్టేషన్‌కు కూడా వెళ్లారు.

నీలమణి దుర్గ సన్నిధిలో వార్షిక నవరాత్రి

- 29 నుంచి 50వ వార్షిక నవరాత్రి మహోత్సవాలు
- ఆంధ్రా, ఒడిశా నుంచి అధిక సంఖ్యలో భక్తులు



నీలమణి దుర్గమ్మ

పాతపట్నం:

ఉత్కళాంధ్రుల కొంగుబంగారంలా విరాజిల్లుతున్న పాతపట్నం ఇలవేల్పు నీలమణి దుర్గమ్మ ఆలయ సన్నిధిలో 29వ తేదీ నుంచి అమ్మవారి వార్షిక నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మహోత్సవాలకు ఆంధ్ర, ఒడిశా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. అమ్మవారి మహోత్సవాలు భారీగా నిర్వహించేందుకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు చర్యలు తీసుకుంటున్నారు. తొమ్మిది రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవాలు ఇలా..

ఈ నెల 29న వర్ధినీ కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, దేవ పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, అఖండ దీపస్థాపనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 30న కుంకుమార్చన, ఆవరణ దేవతా హోమాలు, మహారాజ భోగములు, మే 1న అష్టోత్తర శతనామార్చనలు, మూలమంత్ర, మంటపస్థ దేవతా హోమాలు, 2న శ్రీలలిత త్రిశతి నామార్చనలు, శ్రీ సూక్త, దుర్గా సూక్త హోమాలు, 3న శ్రీలక్ష్మీనారాయణ హోమాలు, 4న రుద్ర హోమాలు, 5న వర్ధనీ కలశోద్వాసనములు, అవభృద స్నానం, 6న వర్ధని ప్రతి రోజు ప్రత్యేక పూజలు జరుగుతాయి. 7న బలిహరణలు, మహాపూర్ణాహుతితో పాటు ప్రతి రోజు రాత్రిళ్లు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

29న సాయంత్రం తోట తులసి హరికథ, 30న సాయంత్రం ఉమామహేశ్వర భజన, మే 1 గురువారం సాయంత్రం రాగసుధ మ్యూజికల్ ఆర్కెస్ట్రా, 2న జైసంతోషిమాత కోలాటం, 3న హిమగిరి మాస్టారు ఆధ్వర్యంలో భరత నాట్యం, కూచిపూడి ప్రదర్శన, 4న ఆదివారం సాయంత్రం భజన, 5న బైరాగి నాయుడు సంగీత కచేరీ ఆ తర్వాతి రోజుల్లో పెద్దింటి మోహన్ దాస్ ఏకపాత్రాభినయం, సత్య హరిశ్చంద్ర నాటకాలు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



అమ్మవారి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయానికి రెండు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– టి.వాసుదేవరావు, కార్యనిర్వహణాధికారి, నీలమణి దుర్గ ఆలయం

మే 20న అఖిలభారత సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు మే 20న నిర్వహించనున్న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం మార్చివేసిందన్నారు. యజమానులు చేసే నేరపూరిత చర్యలను నేరాలుగా పరిగణించకుండా కార్మికులు చేసే పోరాటాలను, యాజమానులను ప్రశ్నించినా నేరాలుగా పరిగణించేలా యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా చట్టాలు మారుస్తున్నారని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజల త్యాగాలతో జాతి నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రపంచం కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తివంతంగా జరపాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని, విద్యుత్ భారాలు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు కె.నాగమణి, అల్లు మహాలక్ష్మి, ఎస్.గణపతి, ఎన్వీ రమణ, కె.సూరయ్య, ఎం.ఆదినారాయణమూర్తి, హెచ్.ఈశ్వరరావు, బి.ఉత్తర, ఆర్.ప్రకాశ రావు, పి.లతాదేవి, పి.గోపి, ఆర్.సురేష్ బాబు, త్రినాథ్, సుశీల, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో సీపీఎఫ్ శ్రీలక్ష్మి



శ్రీలక్ష్మి దంపతులకు ఆదిత్యుడి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో భద్రాజీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని మహారాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ (సీపీఎఫ్) అధికారి శ్రీలక్ష్మి తన భర్త వెంకటకృష్ణారావుతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. తొలిసారి అరసవల్లి దర్శనానికి విచ్చేసిన వీరికి ఆలయ ఈవో వై.భద్రాజీ సాంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు వీరి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. వీరితో పాటు స్థానిక ఫారెస్ట్ అధికారులు భాషా తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని రామయ్యపట్నం గ్రామానికి చెందిన వాడ ధర్మరాజు వలస మత్స్యకారుడిగా చెన్నై వెళ్లి ప్రమాదవశాత్తు ఏడాది క్రితం మృతి చెందాడు. దీంతో చెన్నైలోని బోటు యజమానులు, బోట్లకు వెళ్లే మత్స్యకారులు కలిసి రూ.2,50,000లు సేకరించి ధర్మరాజు భార్య జానకమ్మకు గ్రామంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వలస కార్మికులు, రామయ్యపట్నం గ్రామస్తులు పాల్గొన్నారు.

రీ అపోర్షన్‌కు గురవుతున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం: ప్రభుత్వం పాఠశాలల్లో ఒక్కసారిగా చేస్తున్న మార్పులు కారణంగా ఎక్కువ మంది ఉపాధ్యాయులు రీఅపోర్షన్‌కు గురవుతున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జి.రమణలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను మోడల్ ప్రాథమిక పాఠశాలల కోసం వేరే పాఠశాలలకు తరలించడం, అలాగే ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను తొలగించి, ప్రైమరీగా డీ గ్రేడ్ చేయడం వంటి కారణాల వలన ఎక్కువమంది ఉపాధ్యాయులు మిగులుగా ఏర్పడే పరిస్థితులు దాపురిస్తాయన్నారు. వీరంతా బదిలీల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లనున్నారన్నారు. అయితే ప్రతీ శుక్రవారం సమావేశాలు జరుగుతున్నా ఇంతవరకూ వీరికి బదిలీల్లో ప్రాధాన్యత ఉండేలా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరకంగా రీఅపోర్షన్‌కు గురయ్యే ఉపాధ్యాయులకు ప్రస్తుత స్టేషన్ పాయింట్లతో పాటుగా పాతస్టేషన్ పాయింట్లు కూడా వచ్చేలా చేసి బదిలీల్లో కొంతవరకు న్యాయం చేయాలని కోరారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి




కుక్కకాటుకి గాయపడిన బాలుడు




గాయమైన బాలుడి కాలు

టెక్కలి రూరల్: వీధిలో ఆడుకుంటున్న బాలుడిపై వీధి కుక్క దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ఆదివారం టెక్కలిలో చోటుచేసుకుంది. స్థానిక ఆదిఆంధ్ర వీధికి చెందిన ఐదేళ్ల బాలుడు కె.తన్విక్ సాయి తన ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా, ఒక్కసారిగా వీధికుక్క దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. ఇది గుర్తించిన స్థానికులు బాలుడిని కుక్క నుంచి రక్షించి, టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

విద్యుత్‌కు వేసవి షాక్..!



- లోడ్ ఎక్కువైతే వైర్లు కాలిపోయే ప్రమాదం
- షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలకు ముప్పు
- సరఫరాలో లోపాలుంటే సిబ్బందికి ఫిర్యాదు చేయాలి



లో ఓల్టేజీతో ఇబ్బందులు పడుతున్న శ్రీనీలమణిదుర్గ కాలనీ

పాతపట్నం: వేసవి వచ్చిందంటే ఎండల తీవ్రత పెరుగుతూనే ఉంటుంది. ఇప్పటికే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి విద్యుత్ వినియోగాన్ని పెంచుకుంటాం. ఇంతవరకు బాగానే ఉన్నా కన్సీల్డ్ వైరింగా, గోడలపైనే గొట్టాల్లో వైరింగ్ ఏర్పాటు చేశారా, సరైన ప్రమాణాలతో తగిన మందం ఉన్న వైర్లు వైశారా అనేది అందరూ గుర్తించాల్సిన విషయం. వైరింగ్‌లో ఏవైనా లోపాలుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యే ప్రమాదం ఉందనే విషయాన్ని గుర్తించాలి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జాగ్రత్తలతో పాటు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధిక లోడుతో అనర్థమే

వేసవి కాలంలో విరివిగా విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒక్కొక్కసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాల్లో, కార్యాలయాల్లో వాడుతున్న విద్యుత్ వాడకాన్ని బట్టి లోడ్‌ను నిర్ధారించుకుని ఆమేరకు విద్యుత్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. దీంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వినియోగదారునికి అవసరమైన లోడ్‌ను ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లో విద్యుత్ శాఖ అందుబాటులో ఉంచుతుంది. ఎవరైనా వినియోగదారుడు కేవలం 1కేవీ లోడుకు మాత్రమే అనుమతి పొంది. వేసవి తీవ్రత దష్ట్యా అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే ఆ ప్రభావం సమీప ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంది. వినియోగదారులందరూ విద్యుత్‌శాఖకు సహకరించి వాడుతున్న లోడ్‌కు అనుగుణంగా అనుమతి పొందితే భవిష్యత్‌లో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతరత్రా విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో కచ్చితంగా స్టెబిలైజర్లను వినియోగించాలి. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తుంటే సత్వరమే సంబంధిత విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి.

అప్రమత్తత అవసరం



వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఉంది. షార్ట్ సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్‌ను చేయించుకోవాలి. ఎటువంటి సమస్యలు ఉన్నా సిబ్బందికి తెలియజేయాలి.

– జి.ప్రసాదరావు, డీఈఈ, విద్యుత్‌శాఖ, పాతపట్నం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వేసవికాలం ప్రారంభమయ్యే ముందు ప్రతి ఒక్కరూ ఇళ్లు, కార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రైవేటు ఎలక్ట్రీషియన్లతో తీగల వ్యవస్థను తనిఖీ చేయించుకోవాలి
- విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ, బీఐఎస్ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రిని మాత్రమే ఉపయోగించాలి.
- ఇంట్లో విద్యుత్ వినియోగం ఆధారంగా విద్యుత్‌శాఖ నుంచి లోడ్‌ను తీసుకోవాలి.
- అందుకు తగినట్లు వైరింగ్ ఏర్పాటు చేసుకున్న తర్వాత ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రో ఒవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించాలి.
- ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని బట్టి దానికనుగుణంగా నాణ్యత కలిగిన విద్యుత్ తీగలను వినియోగించాలి.
- నాసిరకం విద్యుత్ పరికరాలతో విద్యుత్ వృథా కావడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వైరింగ్ మరింత పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి.
- గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలని.
- ఎండాకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పనిచేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, దొడ్డుఉప్పు ఉపయోగించాలి.



పాతపట్నం విద్యుత్ సబ్ స్టేషన్

ఇలా చేయవద్దు

- గృహాల్లో 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించేచోట, 30 యాంప్స్ విద్యుత్ భారంపడే పరికరాలు వినియోగిస్తే తీగలు కాలిపోయే ప్రమాదముంది.
- ఒకే స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే ఒక్కసారిగా లోడ్ పెరిగి స్పార్క్ వచ్చి ప్రమాదాలు జరిగే అవకాశముంటుంది.
- ఎండలో విద్యుత్ తీగలు ఉంచితే భవిష్యత్తులో తీగలపై ఉన్న రబ్బర్ మెత్తబడి ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఉత్పన్నమవుతాయి.
- ఇంట్లో ఒకేసారి విద్యుత్ ఉపకరణాలన్నింటినీ ఆన్‌చేసి ఉంచవద్దు.
- కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలను చిందరవందరగా ఉంచరాదు.
- రక్షణ పరికరాలైన ఎంసీబీ(మైక్రో సర్క్యూట్ బ్రేకర్), ఎంసీసీబీ(కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులను బైపాస్ చేయకూడదు.
- విద్యుత్ వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.
- విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకు ఉండే సర్వీస్ వైర్లు అతుకులు లేకుండా ఉండేలా చూసుకోవాలి.

వేసవికాలం.. ఆరోగ్యం భద్రం..!



- రోజురోజుకూ పెరుగుతున్న వేసవి తాపం
- వడదెబ్బకు గురయ్యే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు

హిరమండలం:

వేసవితాపం రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలను తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో రోజంతా మండుటెండలో కష్టించి పనిచేసే వేతనదారులు, కార్మికులు తగు జాగ్రత్తలు పాటించాలని సంబంధిత శాఖాధికారులు సూచిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా వడదెబ్బకు గురవ్వడంతో పాటు అనారోగ్య సమస్యల బారినపడతారని హెచ్చరిస్తున్నారు. ఎండల్లో ఇబ్బందులు పడకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని సూచిస్తున్నారు.

తారెత్తిస్తున్న ఎండలు

ప్రస్తుతం ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో బయటకి రావాలంటేనే ఆలోచిస్తున్నారు. కాగా రానున్న రోజుల్లో మరింత తీవ్రస్థాయికి ఉష్ణోగ్రతలు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో ప్రజలు మరింత భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో అన్నివర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. పని ప్రదేశాల్లో చల్లని నీరు, నీడ వసతి ఏర్పాటు చేసుకోవాలి. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫ్లూయిడ్స్ అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవడం ఉత్తమం. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ ప్రదేశాల్లో కార్మికులు పనిచేయకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఉపాధి వేతనదారులు, కార్మికులు, దుకాణాల్లో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులు తదితర గ్రామికులు కూడా అప్రమత్తంగా ఉండాలి. లేనిపక్షంలో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడక తప్పదని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



వేసవిలో ఎండలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా బయట ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఎండలో పనిచేయడం, తిరగడం వలన శరీరంలో నీటిశాతం తగ్గి డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో క్రమం తప్పకుండా నీటిని తాగాలి. పండ్ల రసాలు, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి తీసుకుంటే వడదెబ్బ బారిన పడకుండా ఉంటారు.

– ఆర్.కాశీప్రసాద్, ఎంపీడీవో, హిరమండలం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సాధ్యమైనంత వరకు చల్లని ప్రదేశాల్లో పనులు చేసుకోవాలి.
- వదులైన పలుచని కాటన్ దుస్తులు ధరించాలి.
- తలకు టోపీ పెట్టుకోవడం మంచిది.
- మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్య ఎండలో తిరగకూడదు
- నీటిని ఎక్కువగా తాగాలి, మజ్జిగ తీసుకోవాలి.
- గది ఉష్ణోగ్రతలను తగ్గించుకోవాలి. చక్కని వెంటిలేషన్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంటి పైకప్పు మీద గడ్డిలాంటివి ఉంచి చల్లటి నీరు పట్టించాలి.
- వడదెబ్బకు గురైన వ్యక్తికి చల్లని గాలి అందేలా చూడాలి. దుస్తులు వదులు చేయాలి.
- వడదెబ్బకు గురైన వ్యక్తి శరీరాన్ని తడి గుడ్డతో తుడవాలి.
- బాధితుడిని సాధ్యమైనంత త్వరగా ఆస్పత్రికి తరలించాలి.



ఎండలో పనిచేస్తున్న వేతనదారులు

'నా ప్రశ్నకు బదులేది' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు రచించిన నా ప్రశ్నకు బదులేది మినీ కవితా సంపుటిని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు శ్రీకాకుళంలోని ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. కవి, రచయత, జర్నలిస్ట్ అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ కృష్ణారావు పుస్తక సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు, శ్రీకాకుళం జిల్లా జేఏసీ చైర్మన్ హనుమంతు సాయిరామ్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల ఐక్యతను ఈ కవితా సంపుటిలోని కవితలు ప్రతిబింబించేవిధంగా ఉన్నాయని కొనియాడారు. అరుణోదయ సాంస్కృతిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ వామపక్షాల ఐక్యత ప్రస్తుత భారతదేశంలోని సమస్యలను పరిష్కరించడానికి దోహదపడుతుందన్నారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా రైతాంగ, కార్మిక ప్రజా ఉద్యమాలను గుర్తుచేసే కవితలు పేడాడ కృష్ణారావు రాయడం అభినందనీయమని అన్నారు.

కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పప్పల రాజశేఖర్, బమ్మిడి శ్రీరామ్మూర్తి, వి.సత్యనారాయణ, కూన రంగనాయకులు, శీర రమేష్, బలివాడ ధనుంజయరావు, బోనెల రమేష్, కనిమెట్ట పద్మావతి, గురుగుబెల్లి భాస్కరరావు, దుప్పల శివరాంప్రసాద్, వల్లభ మల్లయ్య పాల్గొన్నారు.

నీటికుండీలో పడి కార్మికుడు మృతి



కాళీరాయ్ మృతదేహం

టెక్కలి: కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి గ్రామ సమీపంలోని సాయిరాం గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమలో పనిచేస్తున్న అస్సాం రాష్ట్రం బొంగైగో జిల్లా, గురునానక్ నగర్‌కు చెందిన కార్మికుడు కాళీరాయ్ (34) పరిశ్రమకు సంబంధించిన రీసైక్లింగ్ నీటి కుండిలో పడి మృతి చెందాడు. మృతుడు రాయ్ ఈ పరిసర ప్రాంతాల్లోని అనేక పరిశ్రమల్లో ఇదివరకు పనిచేశాడు. అయితే రాయ్ రెండు రోజులుగా పనికి రాకపోవడంతో తన స్వగ్రామానికి వెళ్లి ఉంటాడని భావించామని గ్రానైట్ యాజమాన్యం, తోటి కూలీలు చెబుతున్నారు. నిత్యం మద్యానికి అలవాటుపడిన రాయ్ ఆదివారం తెల్లవారేసరికి కంపెనీకి చెందిన 10 అడుగుల లోతు ఉన్నటువంటి రీసైక్లింగ్ నీటి కుండిలో శవమై తేలాడు. ఇది గమనించిన తోటి కూలీలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



రణస్థలం: ఈనెల 25వ తేదీన రాత్రి 9 గంటల సమయంలో ఎన్‌హెచ్-16 రహదారిపై యూబీ పరిశ్రమ దగ్గర రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మరణించినట్లు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆదివారం తెలిపారు. మృతుడికి 40-45 సంవత్సరాలు ఉంటాయని, తలకు బలమైన గాయమవ్వడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడని పేర్కొన్నారు. గుండుతో ఉన్నాడని, కాఫీ కలర్ ప్యాంట్, ముదురు నీలిరంగు టీషర్టు ధరించినట్లు వెల్లడించారు. వ్యక్తి వివరాలు తెలిసినవారు 63099 90816, 63099 90850 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



మృతుడు ఆనందరావు (ఫైల్)

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం యలమంచిలి గ్రామానికి చెందిన బందావు ఆనందరావు(38) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు ఆనందరావు నిత్యం మద్యం సేవిస్తుంటాడు. అతని భార్య తేజావతి రెండు రోజులు క్రితం మద్యం తాగవద్దని మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన అతడు పురుగుల మందు తాగేశాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కోటబొమ్మాళి పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య తేజావతితో పాటు కుమార్తెలు నాగమణి, మీనా, కుమారుడు భవానీ ప్రసాద్‌లు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇక నేరుగా చెల్లింపులు..!

- మున్సిపాలిటీ సాధారణ నిధులు ఖర్చుచేసే అవకాశం



శ్రీకాకుళం: రాష్ట్రంలోని నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సమకూరే సాధారణ నిధులు నేరుగా ఖర్చు చేసుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. మున్సిపాలిటీలకు పన్నుల ద్వారా, షాపు అద్దెలు ద్వారా, ఆశీలు తదితర మార్గాల ద్వారా వచ్చే ఆదాయాన్ని సాధారణ నిధులకు జమ చేస్తారు. ఇదివరకు ఇలా వసూలు చేసిన మొత్తాన్ని సీఎంఎఫ్ఎస్‌లో ఉండే ప్రత్యేక ఖాతాలకు జమచేసేవారు. మున్సిపాటీలు ఏవైనా బిల్లులు కానీ, ఖర్చులు కానీ చేయాలనుకుంటే ఆయా బిల్లులను సీఎంఎఫ్ఎస్‌కు పొందుపరిస్తే అక్కడ నుంచి నిధులు మంజూరు అయ్యేవి. అయితే ప్రభుత్వ తాజా నిర్ణయంతో నగరపాలక సంస్థ అధికారులే కాంట్రాక్టర్‌కు బిల్లులు, ఇతర ఖర్చులను నేరుగా చెల్లించే సౌలభ్యం ఉంటుంది. సంబంధిత అంశానికి సంబంధించిన విధివిధానాలను ఆర్థిక శాఖ ఆమోదించి సంబంధింత శాఖాధికారులకు నివేదించింది. రాష్ట్రాధికారులు దీనికి సంబంధించిన ఉత్తర్వులను ఒకటి రెండ్రురోజుల్లో వెలువరించనున్నారు. అందరి మున్సిపల్ అధికారులకు కొద్దిరోజుల క్రితం జరిగిన సమావేశంలో విషయం తెలియజేశారు.

త్వరలోనే ఉత్తర్వులు



సాధారణ నిధులు నేరుగా ఖర్చు చేసే సౌలభ్యానికి సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు రానున్నాయి. ఈ నిర్ణయం ప్రభుత్వం తీసుకోవడం వాస్తవమే. దీని వలన బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం.

– పీవీవీడీ ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం

వేసవి దుక్కు.. లాభాలు దక్కు



రబీ సాగు దాదాపు పూర్తవ్వడంతో రైతులంతా ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా వేసవి దుక్కులు ప్రారంభించారు. వేసవి దుక్కులు చేసుకోవడం వలన నేల గుల్లబారి నీటినిల్వ చేసేందుకు అనుకూలంగా మారుతుంది. అలాగే భూమి లోపల ఉన్నటువంటి వివిధ రకాల పురుగుల గుడ్లు సూర్య రశ్మికి నశిస్తాయి. అదేవిధంగా భూమిని సారవంతం చేసేందుకు ఆవులు, గొర్రెలు, మేకల మందలు పొలాల్లో వేస్తున్నారు. వేసవి దుక్కుల వలన నేలకు మేలు జరుగుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

- జలుమూరు

మానవ సేవే మాధవ సేవ



కాంప్లెక్స్ ఆవరణలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మానవ సేవే మాధవ సేవ అని ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి కమిటీ సభ్యులు చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్ఎం ఎంపీ రావు, ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది, సత్యసాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

–శ్రీకాకుళ అర్బన్

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/అరసవల్లి: శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో క్రెడాయ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎక్స్‌పో వద్ద ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శశిధర ఆస్పత్రి వైద్యుడు అన్నెపు శశిధర్ ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, బీఎండీ, ఐబ్రెస్ట్ స్కాన్, గర్భాశయ స్కాన్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు.